క్లుప్తంగా

ఘనంగా అన్న సమారాధన



అన్నదానంలో పాల్గొన్న నాయకులు

పెదగంట్యాడ : జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబేకాలనీలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయ సన్నిధిలో శనివారం అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పెంటకోట పైడిరాజు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని వరాహ లక్ష్మీ నరసింహస్వామి ట్రస్ట్ బోర్డు మెంబర్ దొడ్డి రమణ ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మంజుల, పెంటకోట శ్యామలక్ష్మి, పప్పల ఆదిలక్ష్మి, రత్నం, రామారావు, నరసింగరావు, సత్యవతి, సావిత్రి, లక్ష్మి, నాగమణి, పద్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

71వ వార్డులో ..

గాజువాక : జీవీఎంసీ 71వ వార్డు శ్రీనగర్‌లో నూకాంబిక అమ్మవారి పండుగ సందర్భంగా అన్న సమారాధనను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. అంతకుముందు అమ్మవారిని దర్శించు కొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, స్థానిక నాయకులు బోయిన రామకృష్ణ, కొండమంచిలి కామేష్, కొయిలాడ గణేష్, వర్మ, ఆర్టీసీ రాజు, ఓబులరెడ్డి, అల్లు భాస్కరరావు, నాగ అప్పారావు, పుష్ప శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌డీసీలో రవీంద్రభారతి విద్యార్థుల సత్తా



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో రవీంద్రభారతి ఉపాధ్యాయులు

కూర్మన్నపాలెం : 41వ అంతర్జాతీయ అంతరిక్ష అభివృద్ధి సమ్మేళనం (ఐఎస్‌డీసీ)–2023 సందర్భంగా జాతీయ అంతరిక్ష కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రవీంద్రభారతి విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. 4,500 ప్రవేశాలు, 19 దేశాలు, 26 వేల మంది విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో ప్రపంచంలోనే తృతీయ బహుమతిని రవీంద్రభారతి విద్యార్థులు కైవసం చేసుకున్నారు. నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన పలు ప్రాజెక్టులుగానూ జానస్ ప్రాజెక్ట్ ప్రపంచ తృతీయ బహుమతిని గెలుచుకోగా, ప్రోక్లస్ ప్రాజెక్ట్ విశిష్ట బహుమతిని సాధించిందని రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మన్ ఎం.ఎస్.మణి, డైరెక్టర్ ఎం.ఎస్.రేవంత్ పేర్కొన్నారు. అనంతరం విజేతలను అభినందించారు.

'చలో ఢిల్లీ' కి కార్మిక నాయకులు



విశాఖ రైల్వేస్టేషన్‌లో ఢిల్లీకి బయలుదేరిన కార్మిక నాయకులు

తాటిచెట్లపాలెం: ఢిల్లీలో ఈ నెల 5న జరగనున్న కార్మిక, కర్షక సంఘర్ష్ ర్యాలీకి విశాఖ నుంచి కార్మిక నాయకులు శనివారం ఉదయం సమతా ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వెళ్లారు. సుమారు వంద మంది భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికులు తరలి వెళ్లారు. వీరికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలు, కార్మిక చట్టాల తొలగింపు, కనీస వేతనం, కొత్త పెన్షన్ విధానం రద్దు కనీస మద్దతు ధర వంటి పలు అంశాలపై ఢిల్లీలో ర్యాలీ జరగనుందని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శులు తులసి, అప్పలరాజు, అనసూయ, నాయకులు బి.వెంకటరావు, శంకరరావు, దేవి, బృంద, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

● మా భవిష్యత్ నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి



సమావేశానికి హాజరైన కన్వీనర్లు, గృహ సారథులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలో రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఈ పథకాల ద్వారా ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకే మళ్లీ మొగ్గు చూపుతారని చెప్పారు. మా భవిష్యత్ నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో కన్వీనర్లు, గృహ సారథులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి వారికి అందుతున్న పథకాలను గురించి తెలుసుకోవాలని సూచించారు. అర్హత ఉండి పథకాలు అందని వారికి వర్తింప జేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రతి పక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రజల దృష్టి మళ్లించేలా చేస్తున్నాడని, దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 3న విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశం నిర్వహించనున్నారని తెలిపారు. ఆ సమావేశంలో ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు పలు సూచనలు చేయనున్నారని, దాని ప్రకారం పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయనున్నామన్నారు. ఈ నెల 7 నుంచి డోర్ టూ డోర్ వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. దీని కోసం కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి మా భవిష్యత్ నువ్వే జగనన్న అనే స్టిక్కర్లను డోర్ల మీద అతికించాలన్నారు. అలాగే పార్టీకి సంబంధించిన ఫోన్ నంబర్‌కు ప్రజల ఫోన్ నుంచి మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, పల్లా చినతల్లి, మార్లపూడి పరదేశి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, బొడ్డు నర్సింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, ఉరుకూటి చందు, వార్డు ఇన్‌చార్జిలు కోమటి శ్రీనివాసరావు, ధర్మాల శ్రీను, సిరట్ల వాసు, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, మహాలక్ష్మీ నాయుడు, దొడ్డి రమణ, క్లస్టర్ ఇన్‌చార్జిలు కలుకూరి మంగరాజు, రాజాన వెంకటరావు,ఎండీ గౌస్, నాయకులు మంత్రి శంకర నారాయణ, ఎన్నేటి రమణ, బొడ్డ గోవింద్, చిక్కా సత్యనారాయణ, నక్కా వెంకటరమణ, యువశ్రీ, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో ఇబ్బందులు



లంకెలపాలెం నుంచి ఫార్మాసిటీకి వెళ్లే మలుపులో ధ్వంసమైన రహదారి



ఫ్రీలెఫ్ట్ మార్గంలో గోతులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెం జాతీయ రహదారి నుంచి జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీకి వెళ్లే మార్గంలో మలుపు వద్ద రహదారి ధ్వంసమైంది. అంతేకాకుండా జాతీయ రహదారిలో ఎడమ వైపు వాహనాలు ఫార్మాసిటీలోకి వెళ్లందుకు ఏర్పాటు చేసిన ఫ్రీ లెఫ్ట్ వద్ద రహదారి గోతులమయంగా మారింది. దీంతో వందలాది ఫార్మా ఉద్యోగుల బస్సులతోపాటు వేలాది ద్విచక్రవాహనాలు, లారీలు మలుపు వద్ద అదుపు తప్పి గోతుల్లో దిగిపోతున్నాయి. రహదారి చాలా వరకు ధ్వంసం కావడంతో వాహనచోదకులు భీతిల్లుతున్నారు. కూడలికి రెండొందల మీటర్ల దూరం నుంచి రహదారి పలుచోట్ల బీటలు వారడం, గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారుల సంస్థ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కార్మికులపై చిన్నచూపు తగదు



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కార్మికులు శ్రమ ఎనలేనిదని, అటువంటి కార్మికులను కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు 779వ రోజుకు చేరుకున్నాయి. ఈ ఉక్కు రిలే నిరాహారదీక్షలో స్టీల్‌ప్లాంట్ చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ప్లాంట్ అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కార్మిక వర్గం ఎంతగానో శ్రమించిందన్నారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కేంద్రాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇతర పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో అన్ని వార్గలకు సమన్యాయం పాటిస్తూ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని 68వ వార్డు మిందిలో వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూషతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గడప గడపలో ఎమ్మెల్యే నాగిరెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా ప్రధానకార్యదర్శి, గాజువాక వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్, నాయకులు జీలకర్ర నాగేంద్ర, వరదాడ వెంకటరమణ, రొక్కం వెంకట్రావు, ఈటి సురేష్, సంద్రాన నూకరాజు, మళ్ల కుమార్, దాడి సంతోష్, పుప్పల లక్ష్మి, గెడ్డం కృష్ణవేణి, రెడ్డిపల్లి అవినాష్, పలు విభాగాల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా చలపతి స్నాతకోత్సవం



సర్టిఫికెట్లతో చిన్నారులు

గాజువాక : స్థానిక చలపతి స్కూల్‌లో చిన్నారుల స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఎ.బాలరెడ్డి చేతులమీదుగా యూకేజీ విద్యార్థులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అన్నెపురెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షురాలు ప్రాన్సినారెడ్డి, పాఠశాల డీన్ కె.గణేష్, ప్రిన్సిపాల్ టి.లీలారత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ జి.అమృతరావు, ఏవో ఆర్. శ్రీధర్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాద దృశ్యం



గుణశేఖర్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: విధులు నిర్వహించుకుని వస్తున్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.. మరో యువకుడి తీవ్రగాయాలయ్యాయి. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత షీలానగర్ టోల్ గేటు సమీపంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... విశాఖలోని వీవీపీ రోడ్డులోని ఆల్ఫా పవర్ కంపెనీలో కొశిరెడ్డి గుణశేఖర్ (20) ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి 1.30 గంటలకు రెండు ద్విచక్రవాహనాలపై నలుగురు స్నేహితులు అగనంపూడిలోని ఆర్‌హెచ్‌కాలనీలో తమ నివాసానికి బయలుదేరారు. గుణశేఖర్ ద్విచక్రవాహనాన్ని డ్రైవ్ చేస్తుండగా..వెనుక తుడు ములూరి అజయ్ కుమార్ కూర్చున్నాడు. మరో వాహనంపై ఇద్దరు స్నేహితులతో కలిసి మారుతీ జంక్షన్ నుంచి షీలానగర్ టోల్ గేటు మధ్యలో వచ్చే సరికి వైజాగ్ పోర్టు నుంచి ఎస్.కోటలోని గోల్డ్ స్టార్ కంపెనీకు వెళ్తున్న లారీ బ్రేక్ డౌనయ్యి రోడ్డు పక్కన ఆగిపోయింది. రెండు ద్విచక్ర వాహనాలు పక్కపక్కగా వస్తూ గుణశేఖర్ డ్రైవ్ చేస్తున్న వాహనం ఆగి ఉన్న లారీని బలంగా ఢీ కొట్టింది. దీంతో గుణశేఖర్ తీవ్రంగా గాయపడగా షీలానగర్‌లో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారిజామున మృతి చెందాడు. అగనంపూడికి చెందిన అజయ్ కుమార్‌కు కాలు విరిగిపోగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గుణశేఖర్ తండ్రి ఉక్కు ఉద్యోగి. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా..అందులో గుణశేఖర్ చిన్నవాడు. చేతికి అందివచ్చిన కుమారుడు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు రమణారావు, కనకమహాలక్ష్మి, సోదరుడు సూర్యప్రకాష్ కన్నీరుమున్నీరుగా విలపించారు. గాజువాక ఎస్‌ఐ సూర్యకళ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రమశిక్షణతో విద్య అవసరం



విద్యార్థికి సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే

గాజువాక : విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక యాపిల్ ఐ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విలువలతో కూడిన విద్యను నేర్చుకున్న ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. చిన్నారులకు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవడంపై కూడా ఉపాధ్యాయులు దోహదపడాలన్నారు. పాఠశాల చైర్మన్ టి.బలరామకృష్ణ, డాక్టర్ మధుకర్, ప్రిన్సిపాల్ పామెల ముఖర్జీ పాల్గొన్నారు.

వివిధ కేసుల్లో ఇద్దరికి జైలు, జరిమానా

అక్కిరెడ్డిపాలెం : చెక్ బౌన్స్ కేసులో నేరం నిరూపణ కావడంతో ఒకరికి 6 నెలల జైలు, రూ.3,30,000 చెల్లించాలని తీర్పు వెలువరించారు. గాజువాకకు చెందిన కె.వర్మ రాజుకు అదే ప్రాంతానికి చెందిన సూరిశెట్టి సత్యప్రకాష్ రూ.3,20,000 ఇవ్వాల్సి ఉంది. దీంతో సత్యప్రకాష్ నగదుకు బదులు చెక్ ఇచ్చాడు. ఇది బౌన్స్ అయింది. దీనిపై వర్మ రాజు కోర్టులో కేసు వేయగా విచారణ జరిపిన గాజువాక 3వ అడిషనల్ సీఎంఎం కోర్టు జడ్జి రాజేంద్ర బాబు పై విధంగా తీర్పునిచ్చారు.

బ్యాంకును మోసం చేసి కేసులో..

గాజువాకకు చెందిన డి.వెంకటరమణ అదే ప్రాంతానికి చెందిన కెనరా బ్యాంక్‌లో రూ.6 లక్షల చెక్కును వేశాడు. బ్యాంక్‌లో సాంకేతిక కారణాల వల్ల నగదు జమ కాలేదనడంతో వ్యక్తి చెక్‌ను తిరిగి తీసుకువెళ్లిపోయాడు. రెండు రోజుల తర్వాత అతని అకౌంట్‌లో రూ.6 లక్షలు జమ అయ్యాయి. దీంతో వెంకటరమణ నగదును డ్రా చేసుకున్నాడు. తర్వాత బ్యాంక్ అధికారులు రమణకు చెక్‌ను వాపస్ చేయమని అడగ్గా అతని చెక్ ఇవ్వడానికి నిరాకరించాడు. దీంతో బ్యాంక్ అధికారులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. బ్యాంక్‌ను మోసం చేసినట్లు నిర్ధారించి వెంకటరమణకు 3 నెలలు జైలు శిక్షణ, రూ.6 లక్షలు తిరిగి చెల్లించాలని తీర్పు ఇచ్చింది.

8న ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 8న నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం కళాశాల అల్యుమ్ని అధ్యక్షుడు అజ్జరాపు సర్వేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించి తీర్మానించారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న పూర్వ విద్యార్థుల సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం

సీతంపేట : రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంఘం ఆరోపించింది. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం సమావేశం స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వై.బి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్పంచులు ఎవరూ విద్యుత్ బిల్లులు కట్టవద్దన్నారు. సర్పంచుల సంతకం లేకుండా 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లు నిధులు దారి మళ్లించిందని విమర్శించారు. సర్పంచుల విధులు, నిధులు, అధికారాలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి మాట్లాడుతూ సర్పంచుల గౌరవ వేతనం రూ.15వేలకు, జెడ్పీటీసీ, ఎంపీటీసీల గౌరవ వేతనం రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

9న మానవ హక్కుల కౌన్సిల్ సమావేశం

డాబాగార్డెన్స్: మానవ హక్కుల కౌన్సిల్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న నిర్వహించనున్నట్టు కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న సమావేశంలో విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా సన్యాసిరావు పలువురు సభ్యులను సన్మానించనున్నట్టు చెప్పారు. మానవ హక్కుల కమిషన్, మానవ హక్కుల కోర్టుల పనితీరుపై చర్చా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

గురుమూర్తిరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డికి కేక్ తినిపిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: పెందుర్తి మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్‌లో గల ఆయన స్వగృహంలో నిర్వహించిన ఈ వేడుకలకు రాష్ట్ర భారీపరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ సత్యవతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, బట్టు సూర్యకుమారి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చేనేత, హస్త కళలను ప్రోత్సహించాలి



స్టాల్‌ను పరిశీలిస్తున్న యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్‌రావు తదితరులు

ఉక్కునగరం: చేనేత, హస్త కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావు అన్నారు. భావనా రుషి చేనేత హస్త కళా కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత, హస్తకళలు భారత దేశ ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలన్నారు. అన్ని రకాల వస్తువులు ఒకే చోట ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉక్కునగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవా సంఘం నిర్వాహకులు ఎ. సింహాద్రి, బి. సురేష్‌లు మాట్లాడుతూ ప్రదర్శనలో పోచంపల్లి, నారాయణపేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెండ్, బెంగాల్ సిల్క్, కాంతావర్క్ కాటన్, భాగల్‌పూర్ సిల్క్, బాంధిని సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్, లక్నో చికెన్ వర్క్స్, డోర్ కర్టెన్లు, డోర్ మేట్లు, వరంగల్ టవల్స్ అండ్ బెడ్‌షీట్లు, రాజస్థానీ ప్రింటెడ్ టాప్స్, జైపూర్ టాప్స్, జైపూర్ బెడ్‌షీట్లు, ఖాదీ షర్ట్స్, సారంగాపూర్ వుడ్ ఐటమ్స్ అందులో ఉంచామన్నారు. ఈనెల 23వరకు నిర్వహించనున్న ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి డొక్క నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో గల కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించినందుకుగానూ పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఏ.శ్రీనివాసరావు, వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు క్రీడాకారులను అభినందించారు. శనివారం ఉదయం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్.ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ మార్చి 30వ తేదీన చతీస్‌గడ్‌లో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ త్రోబాల్ పోటీల్లో కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు సీహెచ్.సునీత, ఎం.తేజశ్రీ, ఎస్.సాయిలిఖిత, డి.చందన, ఓ.చరిష్మా, ఎస్.రిషిత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. 87వ వార్డు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తుల్లో విద్యార్థులు రాణించి రాష్ట్రానికి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలన్నారు.

● పూలు గుస గుసలాడేనని..



మొక్కలు నేడు చెట్లుగా ఎదిగి.. అందమైన పూల సొగసుతో ఇట్టే ఆకట్టుకుంటున్నాయి..

వసంతం.. పకృతి సోయగం.. శోభాయమానం.. అలా చూస్తుంటే పరవశం అన్నట్టుగా ఉంది కదూ ఈ చిత్రం.. పూలు గుస గుసలాడేనని.. చెల రేగేనని.. అంటూ పాడుకోవాలని అనిపిస్తోంది కదూ.. వేసవిలో ఆకు రాలే సమయంలో.. చిగురు తొడిగేందుకు సిద్ధమైన వేళలో.. ఓ చెట్టు మాత్రం మొత్తం పూలతో అబ్బురపరుస్తోంది.. అందమైన పూలతో కనువిందు చేస్తోంది.. విదేశాల్లోనే కనిపించే ఇటువంటి దృశ్యాలు మనకు కూడా తారసపడితే ఇలా ఉంటుంది అనేందుకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. ఇంతకీ ఈ చెట్టు పేరు ఏంటంటే.. తబీబియో రోజియో అనే ఈ చెట్లు స్థానిక వినాయకనగర్ వుడా కాలనీ, టింపనీ స్కూల్ దారిలో రోడ్డుపై ఉన్నాయి... జీవీఎంసీ అధికారులు నాటిన మొక్కలు నేడు చెట్లుగా ఎదిగి.. అందమైన పూల సొగసుతో ఇట్టే ఆకట్టుకుంటున్నాయి..

–పెదగంట్యాడ

10న పెంటమాంబ అమ్మవారి ప్రధాన పండగ



ఆలయ ప్రాంగణంలో ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామ పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పెంటమాంబ అమ్మవారి పండగ ఉత్సవాలను గత నెల 29న ప్రారంభించామని, ఈ నెల 18 వరకూ నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి సత్యారావు, గొందేశి అప్పలరెడ్డి చెప్పారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. అమ్మవారి ప్రధాన పండగను ఈ నెల 10న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఆ రోజు అర్ధరాత్రి ఒంటి గంట నుంచి అమ్మవారికి విశేష పూజలు చేసి, భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. ఉదయం దేవీ హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలతో పాటు అదే రోజు అమ్మవారి అనుపు ఉంటుందన్నారు. ఏటా ఇక్కడ అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామని, ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలనూ ఏర్పాటు చేశామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ సమావేశంలో పులి రాజారెడ్డి, ఎల్లేటి శ్రీనివాసరావు, పిట్టా సత్యనారాయణరెడ్డి, నామాల పెంటయ్య, రామిరెడ్డి, ముద్దుర్తి శ్రీరామ్మూర్తి, గొందేశి సుమన్‌రెడ్డి, చప్పడి నాగరాజు, కోన అప్పలరాజు, నీలాపు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.